క్లుప్తంగా

అనాథ శవానికి అంత్యక్రియలు



అంజినమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గోరంట్ల: స్థానిక శంకరనారాయణ ఆయిల్ మిల్ సమీపంలో గుడారం వేసుకొని నివాసిస్తున్న అనాథ మహిళ అంజినమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. యాచిస్తూ వచ్చిన డబ్బుతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌తో ఆమె జీవనం సాగించేదని స్థానికులు తెలిపారు. అంజినమ్మ మృతి విషయం తెలుసుకొన్న స్థానిక ఎస్‌ఐ ఇక్బాల్‌బాషా సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయంతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



బోల్తాపడిన బొలెరో, రోడ్డు పక్కన పడిపోయిన కొత్తిమీర బ్యాగులు

పెనుకొండ: పట్టణ సమీపంలో కే9 వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన నాగరాజు అనే డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరు నుంచి అనంతపురానికి కొత్తిమీర లోడుతో బులోరా వాహనంలో వెళుతుండగా కే9 వద్ద వాహనం అదుపుతప్పింది. రోడ్డు పక్కనున్న సిమెంట్ దిమ్మెలను ఢీకొని బోల్తా పడటంతో డ్రైవర్ నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాద ఘటనపై వివరాలు సేకరించారు. బాధితుడిని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

శతాధిక వృద్ధురాలి కన్నుమూత



నరసమ్మ (ఫైల్)

రొళ్ల (అగళి): అగళి పట్టణంలో నివాసం ఉంటున్న రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దేవరాజు మాతృమూర్తి నరసమ్మ (100) కన్నుమూశారు. ఇందులో భాగంగానే సోమవారం అగళిలో వారి తోటలో అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై నరసమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. నరసమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఈఓగా బాధ్యతలు స్వీకరించిన బాబురావు

గోరంట్ల: మండల కేంద్రమైన గోరంట్ల మేజర్ పంచాయతీ ఈఓగా సోమవారం బాబురావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సతీష్‌కుమార్ కదిరి రూరల్‌లోని కాళసముద్రం పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో రొళ్లలో పనిచేస్తున్న బాబురావు ఈఓగా బదిలీపై వచ్చారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని బాబురావు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



వైష్ణవి

లేపాక్షి: లేపాక్షిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఇటీవల పదో తరగతి పూర్తిచేసుకున్న వైష్ణవి అనే విద్యార్థిని అండర్–17 బాలికల విభాగంలో యోగాలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌ఓ నీలిమా తెలిపారు. వైష్ణవి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక కావడం పట్ల ఎస్‌ఓతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ వలంటీర్లకు సన్మానం



వలంటీర్లకు సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సేవలు అందిస్తున్న వలంటీర్లకు వందనమని 4వవార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ రెహెనా, వైఎస్సార్‌సీపీ నాయకులు దాదులు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం 4వార్డు సచివాలయంలో ఉత్తమ సేవలు అందించి అవార్డు పొందిన వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన పండ్ల ధరలు

- అధిక ఎండలు, జ్యూస్ సెంటర్లలో వినియోగమే కారణం



మార్కెట్‌లోని ఓ దుకాణంలోని ఫలాలు

హిందూపురం టౌన్: భానుడి దెబ్బకు ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. దీంతో ప్రజలు చల్లటి నీరు, జ్యూస్‌లను తాగేందుకు మొగ్గు చూపుతున్నారు. జ్యూస్ సెంటర్లలో ఎక్కువగా పండ్ల రసాలు తాగేందుకే మక్కువ చూపుతున్నారు. దీంతో మార్కెట్‌లో ఆపిల్, దానిమ్మ, పైనాపిల్, కమలా పండ్లు, ద్రాక్ష, బొప్పాయి, అరటి, మామిడి, సపోటా తదితర పండ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఏ రకమైన పండు కొనాలన్నా వందల్లో రేట్లు పలుకుతున్నాయి.

పెరిగిన వినియోగం

ఆరోగ్యంతో పాటు పూజా కార్యక్రమాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో ప్రజలు ఎక్కువగా పండ్లు కొనుగోలు చేస్తుంటారు. పోషక విలువలు ఉన్న పళ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని వైద్యులు చెబుతున్నారు. వేసవిని సాకుగా చూపి దిగుమతి లేదని, గిరాకీ అని చెప్పి వ్యాపారులు రేట్లు అమాంతం పెంచుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఎండల వేడికి పండ్ల రసాలు తాగేవారు పెరగడంతో పండ్ల వినియోగం పెరిగింది.

పండ్ల ధరలతో సెగలు

మార్కెట్‌లో పండ్ల ధరలు సామాన్యుడికి సెగలు పుట్టిస్తున్నాయి. మార్కెట్‌లో ఆపిల్ కేజీ రూ.200 నుంచి రూ.250 , దానిమ్మకాయలు కేజీ రూ.120, నల్లద్రాక్ష కేజీ రూ.120, బొప్పాయి కేజీ రూ.50, పుచ్చకాయ సైజును బట్టి రూ.40 నుంచి రూ.120 వరకూ, ఖర్బూజ కేజీ రూ.35, మామిడి రకాలను బట్టి కేజీ రూ.70 దాకా ధర పలుకుతోంది. దీంతో పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవని వినియోగదారుడు వాపోతున్నాడు. ముఖ్యంగా జ్యూస్ సెంటర్లలో పండ్ల వినియోగం పెరగడంతో ధరలు మండిపోతున్నాయి.

అన్ని ధరలు పెరిగాయి



వేసవి సీజనలో దొరికే పుచ్చకాయ, బొప్పాయి, సపోటా, మామిడి తదితర పండ్ల ధరలు పెరిగిపోయాయి. ప్రస్తుత పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. వేసవిలో పండ్లు కొనుగోలు చేసేకంటే జ్యూస్ సెంటర్‌లో జూస్ తాగడం మేలు. అయితే ప్రస్తుతం అక్కడ కూడా రేట్లు అధికంగానే ఉన్నాయి.

– బాలాజీ, వినియోగదారుడు, శ్రీకంఠపురం



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్టం)

హిందూపురం	35.0
పెనుకొండ	37.0
మడకశిర	35.0

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ బొజ్జిరెడ్డిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ శ్యామలాబాయి తెలిపారు. ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు అధికారులు, సచివాలయ ఉద్యోగులు హాజరు కావాలన్నారు.

రొళ్లలో...

రొళ్ల: మండలంలోని రత్నగిరి సచివాలయం పరిధిలోని అలుపనపల్లిలో మంగళవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. అలాగే 7న రత్నగిరి, 8న బాజయ్యపాళ్యం, ఆర్.గొల్లహట్టి, ఉజ్జీనీపురం గ్రామాల్లో గడప గడపకూ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, ముండల, గ్రామస్థాయి అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ అండ

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: ప్రతి బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ అనారోగ్య సమస్యలతో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పలువురు బాధితులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.4.75 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం కోసం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారన్నారు. ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధ పడకూడదని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఏ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా వారికి వైద్య ఖర్చులను అందజేస్తోందన్నారు. ఏ ఒక్కరూ ప్రభుత్వం అందించిన సాయాన్ని దుర్వినియోగం చేసుకోకుండా సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, టౌన్ కన్వీనర్లు నాగలూరుబాబు, బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ బోయ సునీల్, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, శేషాద్రి, ముఖ్య నాయకులు జయశంకరరెడ్డి, కొండలరాయుడు, గణేష్, శ్రీరాములు, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ అమృత్‌రాజు



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ అమృత్‌రాజు

మడకశిరరూరల్: మండల అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ అమృత్‌రాజు అధికారులకు సూచించారు. సోమవారం ఆయన మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలను తనిఖీ చేస్తూ ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన పాటించే విధంగా చూడాలన్నారు. పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంపొందించుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకోనే విధంగా క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో ప్రజలు అందించే విధంగా చూడాలన్నారు. సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రీయ ఎరువు తయారీ చేసి తక్కువ ధరకు రైతులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సోనిబాయి, అధికారులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పరిశీలన

మడకశిరరూరల్: స్థానిక భవిత కేంద్రంలో జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతను సోమవారం డీఈఓ ఆర్‌డీఓ రామిరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్లు నాణ్యతగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కిట్లును సరఫరా చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభం రోజే పుస్తకాలు విద్యార్థులకు అందించే విధంగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సిద్ధం చేసుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు



బేకరీని పరిశీలిస్తున్న లేబర్ ఆఫీసర్ రమణారెడ్డి

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని పలు దుకాణాలు, హోటళ్లను సోమవారం ఉదయం హిందూపురం లేబర్ ఆఫీసర్ రమణారెడ్డి తనిఖీ చేశారు. హోటల్‌లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలని, నాణ్యమైన ఆహార పదార్థాలనే విక్రయించాలని వ్యాపారస్తులకు సూచించారు. అనంతరం పట్టణంలోని వివిధ షాపులు, ఫ్యాక్టరీలను పరిశీలించి అందులో బాలకార్మికులు ఎవరైనా పని చేస్తున్నారా? అనే దానిపై ఆరా తీసారు. 14 సంవత్సరాల్లోపు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్‌ఐ షర్ఫుద్దీన్, సిబ్బంది ఉన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం: ఖరీఫ్‌లో రైతులు వేరుశనగ పంట సాగు చేయడానికి అవసరమైన నాణ్యమైన విత్తన వేరుశనగ కాయల పంపిణీని సోమవారం ఆర్‌బీకేల్లో ప్రారంభించారు. స్థానిక పూలకుంట ఆర్‌బీకేలోని పంపిణీ కేంద్రాన్ని జెడ్పీటీసీ నాగభూషణం, మండల రైతు సలహా సంఘం అధ్యక్షుడు బసిరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ టీడీపీ పాలనలో వేరుశనగ విత్తనకాయల కోసం రైతులు పడిగాపులు పడేవారని, అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామంలోనే విత్తనకాయలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ మాట్లాడుతూ ఆరు ఆర్‌బీకే కేంద్రాలల్లో 1047 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మండలానికి మొదటి విడతగా 400 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు వచ్చాయన్నారు. మొదటిరోజు 68 మంది రైతులకు పూలకుంట ఆర్‌బీకే ద్వారా 135 క్వింటాళ్ల విత్తన కాయలు అందించామన్నారు. కార్యక్రమంలో ఏఓ సురేంద్రనాయక్, సహాయ వ్యవసాయఅధికారులు ఇమ్రాన్, శంకర్,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు



రైతులకు విత్తన కాయలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: తాలూకా వ్యాప్తంగా పంటలపైనే ఆధారపడి బతుకుతున్న రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ హెచ్చరించారు. స్థానిక ఏపీఎంసీ మార్కెట్ యార్డులో వ్యవసాయ శాఖ ఏడీ విజయమూర్తి ఆధ్వర్యంలో సోమవారం రైతులకు విత్తన వేరుశనగ పంపిణీలో ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తన కాయలను రైతులకు అందివ్వాలన్నారు. సకాలంలో పంట సాగుపై రైతులుకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ఆంధ్రలో క్వింటాల్ కే 6 రకం విత్తన వేరుశనగ సబ్సిడీపోయి రూ 5,580 ధర కాగా ఇక్కడ మాత్రం అదే కాయ రూ 7,600 ధర ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడి ధర తక్కువ చేసేలా ప్రయత్నిస్తానన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు జి నరసింహారెడ్డి , కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప, కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు సుదేశ్ బాబు, శంకరరెడ్డి, బత్తినేని నాని, టెంకాయల రవి తదితరులు పాల్గొన్నారు.

● వరుణుడి కరుణ కోసం..



జీఎన్ పాళ్యంలో ఆవులను ఊరేగిస్తున్న రైతులు

రొళ్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన నేపథ్యంలో వానదేవుడి కరుణ కోసం మండల పరిధిలోని జీఎన్ పాళ్యంలో రైతులు ఆవులను ఊరేగించారు. సోమవారం ఉదయమే ఆవులను నీటితో శుభ్రం చేసి అలంకరించి ఊరేగింపు చేపట్టారు. గ్రామ సమీపంలోని అలుపనపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన వెలసిన పురాతన బసవేశ్వరస్వామి ఆలయం వద్దకు ఆవులతో ఊరేంపుగా తీసుకెళ్లారు. అనంతరం స్వామివార్లకు విశేష పూజలు చేయించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలుకొని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండేలా చూడాలని పూజలు చేశారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



పెనుకొండ: సత్యసాయి కళాశాలలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు



పావగడ: మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్



హిందూపురం: మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పెనుకొండ: పర్యావరణాన్ని కాపాడితేనే మానవ మనుగడ సాధ్యమని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం కళాశాల సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన పర్యావరణం ప్రాధాన్యతను వివరించారు. అలాగే సత్యసాయి డిగ్రీ కళాశాల ఆవరణంలో ఏఓ కేశవయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

హిందూపురం: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని నేటి నిర్లక్ష్యం రేపటి తరాలకు శాపంగా మారకూడదని బాలాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప, ఎస్‌డీజీఎస్ కళాశాల అధ్యక్షులు చంద్రమోహన్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ కళాశాలల్లోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోర్డినేటర్ చంద్రశేఖర్, నాగేంద్ర, బాలకృష్ణ, భాస్కర్, ఎస్‌డీజీఎస్ కార్యదర్శి బైసానిరాంప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రాజన్న, ఫణీంద్ర, శ్రీనివాసమూర్తి, అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పావగడ: అడవులను సంరక్షిస్తేనే మంచి వర్షాలు కురుస్తాయని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అన్నారు. స్థానిక తుమకూరు రోడ్డులోని సాల మరద తిమ్మక్క ఉద్యాన వనంలో అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షిస్తే చెట్లు విరివిగా పెరిగి భావితరాలకు అన్ని విధాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు శ్రీ గంధం మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక అటవీశాఖ అధికారులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పూడికతీత పనులతో చెరువుల బలోపేతం

రొళ్ల: చెరువులో పూడికతీత పనులు చేపట్టి గట్టుకు మట్టిని తోలడం వల్ల చెరువు మరింత బలంగా తయారవుతాయని పంచాయతీరాజ్‌శాఖ డీఈ హరికృష్ణ, మడకశిర సెరికల్చర్ ఏడీ రాజునాయక్, సోషియల్ ఆడిట్ డీఆర్పీ యువరాజ్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని హొట్టేబెట్ట పంచాయతీలోని కొడగార్లగుట్ట గ్రామ సమీపంలోని నాయకనకట్ట, బీజీ హళ్లి పంచాయతీలోని జీజీ హట్టి చెరువులో అమృత్ సరోవర్ కింద చేపట్టిన చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు.

కూలీలకు పనిముట్లు ఇవ్వండి

చిలమత్తూరు: మండలంలో పనిచేసే ఉపాధి కూలీలకు వెంటనే పనిముట్లు పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండలంలో పలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనిముట్లు పంపిణీ చేయాలని పీడీ ఆదేశించినా స్థానిక ఏపీఓ నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు.

నేటి నుంచి మార్గోపదేశ సభలు

పెనుకొండ: పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో నేటి నుంచి 8వ తేదీ వరకు బైబిల్ మిషన్ మార్గోపదేశ సభలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పాస్టర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవ మార్గాన్ని అనుసరించి దైవ చింతనతో జీవించాలి, ప్రతి ఒక్కరినీ ప్రేమించాలన్న విషయాలపై బోధించనున్నట్లు పేర్కొన్నారు.

అగళిలో కంటి వైద్య శిబిరం

రొళ్ల (అగళి): అగళి పట్టణంలోని పుష్పాంజలి చిత్ర మందిరంలో సోమవారం బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రి వైద్య బృందం ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహించింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి కంటి లోపం ఉన్న సుమారు 250 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. అందులో 150 మందికి కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయడంతో పాటు ప్రత్యేక బస్సులో బెంగళూరుకు తరలించారు.

వాహనాల వేలం రేపు

పెనుకొండ: పెనుకొండ సెబ్‌స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను 7న వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. పుట్టపర్తి సెబ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన ర్యాలీ

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా నివారణపై అవగాహన కల్పించారు. సోమవారం డాక్టర్లు జగదీశ్‌బాబు, సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అతిసార నియంత్రణ వార్షికోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈనెల 17 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

అమరాపురం: మండలంలోని రైతులు పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని కెనరా బ్యాంకు మేనేజర్ ప్రహ్లాద తెలిపారు. గత ఖరీఫ్‌లో పంట సాగుకు తీసుకున్న రుణాలకు రైతులు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఆలదపల్లి, హాలుకూరు, తమ్మడేపల్లి, అమరాపురం, మద్దనకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాఠశాలలకు విద్యాకానుక కిట్లు

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి విద్యార్థులు చదువుకోవడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభం రోజే 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే సోమవారం మడకశిర ఉపాధ్యాయ భవనం నుంచి ఉపాధ్యాయులు విద్యార్థులకు అనుగుణంగా జగనన్న విద్యా కానుక కిట్లును పాఠశాలలకు తరలించారు.

నీటి సమస్య పరిష్కారం

గుడిబండ: మండల పరిధిలోని రాళ్లపల్లి గ్రామంలో 15 రోజులుగా తాగునీటి సమస్య ఉండటంతో సోమవారం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి గోవిందప్పకు వినతిపత్రం అందించారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి వెంటనే బోరుకు రిపేరీ చేయించారు. అనంతరం గ్రామంలో పైప్‌లైన్ ఏర్పాటు చేసి వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

రావుడి అభివృద్ధికి చర్యలు తీసుకోండి

రొళ్ల(అగళి): అగళి మండలంలోని రావుడి పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బసవరాజు, ఎంపీటీసీ భర్త బసవరాజు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు విన్నవించారు. సోమవారం మడకశిర పట్టణంలోని ప్రభుత్వ వ్యవసాయశాఖ ఇంజినీయరింగ్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో ఈమేరకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ కొత్త సచివాలయం భవనాన్ని అర్ధాంతరంగా నిలిపి వేశారని పూర్తి స్థాయిలో నిర్మించాలన్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, కరిదాసనపల్లి నుంచి రావుడి ఆంజనేయస్వామి వరకు బీటీ రోడ్డు నిర్మించడంతో పాటు ఖాళీగా ఉన్న సచివాలయ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

అమరాపురం: మండలంలోని హాలుకూరు గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు హాల్ టికెట్లు విడుదలయ్యాయని, అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుళపతి తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌కు వెళ్లి హాల్‌టికెట్లు తీసుకోవచ్చన్నారు. ఈ నెల 11న ఏపీ మోడల్ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.